క్లుప్తంగా

భట్టి పర్యటనపై సమీక్ష

చంద్రుగొండ: ఈ నెల 10వ తేదీన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండలంలోని బెండాలపాడులో పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి లోటు లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు రెడ్‌కో ఉమ్మడి జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ మహిందర్, డీఈ రంగస్వామి, ఏడీఈ రవికుమార్, ఐటీడీఏ ఏటీడబ్ల్యూఓ చంద్రమోహన్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు భోజ్యా నాయక్, బొర్రా సురేష్, ఫజల్‌బక్ష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సంస్థ బాధ్యులు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీకి చెందిన ఏనిక వినోద్–సాజన్య దంపతుల రెండేళ్ల కుమార్తె శాన్వి పుట్టిన మూడు నెలల తర్వాత నుంచి తలభాగం పెరుగుతూ వస్తోంది. చిన్నారి తల్లిదండ్రులు అప్పుసప్పో చేసి వైద్య పరీక్షలు చేయించగా.. వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. విషయం తెలుసుకున్న మణుగూరు జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యులు బుధవారం చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేలను వైద్యఖర్చుల నిమిత్తం చిన్నారి తల్లి సౌజన్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గూడూరు కృష్ణారెడ్డి, సభ్యులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కత్తి అవినాష్, చెన్నూరి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కరకగూడెం: ఎస్సీ కులాల రాజ్యాంగ హక్కుల అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని 'షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి' వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. సమస్యలపై తహసీల్‌లో తహసీల్దార్ నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర నాయకులు ఇనుముల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు నరాల రాజేష్, కుమ్మరి సమ్మయ్య, బోడ నాగేశ్వరరావు, కీసరి దుర్గయ్య, సమ్మయ్య, సల్లూరు ముత్తయ్య, గిద్ద చిన్న రాములు, కీసరి ఎల్లమ్మ పాల్గొన్నారు.

మహిళకు వితరణ

మణుగూరురూరల్: మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు భోగినేని వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా.. సేవాలాల్ సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర నిర్మల, మండల కమిటీ సభ్యులు ఆమె గృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం సేవాలాల్ సేన ఆధ్వర్యంలో 30కేజీల బియ్యం, వెయ్యి రూపాయల నగదును వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల గౌరవ అధ్యక్షుడు గుగులోత్ రవికుమార్, మండల మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ ద్వాలి, మహిళా ఉపాధ్యక్షురాలు గుగులోత్ కవిత పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్లు ఆవిష్కరణ

ములకలపల్లి: రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు హైదరాబాద్‌లో జరుపతల పెట్టిన రైతు ధర్నాను విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ పిలుపునిచ్చారు. ముత్యాలంపాడు గ్రామంలో బుధవారం ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. రైతులు, కూలీలు భారీగా హాజరు కావాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు కల్లూరి పద్మ, ఈసం బాలరాజు, ఈసం పద్మ, కనకం వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దక్కని ఇళ్లు..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండ పంచాయతీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు దక్కలేదని సీపీఎం మండల కార్యదర్శి పెద్దిని వేణు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు రాయి రాజా, మిరియాల మోహన్‌రావు, రామడుగు వెంకటాచారి పాల్గొన్నారు.

అర్హులైన వారికే ఇవ్వాలి..

పినపాక: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, లిస్టులో అనర్హులను తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్‌లో తహసీల్దార్ అద్దంకి నగేష్‌కు సమస్యలతో నాయకులు గంప గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో మణుగూరు

- అడ్డదిడ్డంగా తిరుగుతున్న వాహనాలు
- భారీ వాహనాలు ఆగితే ఇక అంతే..
- వెంటాడుతున్న పార్కింగ్ సమస్య



లారీలు రోడ్డు దాటుతున్న క్రమంలో ఇబ్బందులు పడుతున్న ఇతర వాహనదారులు

మణుగూరురూరల్: ట్రాఫిక్ చక్రబంధంలో మణుగూరు పట్టణం కొట్టుమిట్టాడుతోంది. పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న మణుగూరులో ట్రాఫిక్ సమస్యలను అతలాకుతలం చేస్తోంది. అడ్డదిడ్డంగా తిరుగుతున్న ఆటోలు, ఇతర వాహనాలు ట్రాఫిక్ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో ఎటు నుండి ఏ వాహనం వస్తుందో ఏ వాహనం వెళ్తుందో తెలియని పరిస్థితి. పట్టణంలో ఆటోస్టాండ్ లేకపోవడం ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణమని చెప్పొచ్చు. కొంతమంది వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం.. సరైన పార్కింగ్ లేకపోవడం.. మరికొందరి నిర్లక్ష్యం వెరసి ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రతరమవుతున్నాయి.

కలగానే ఆటోస్టాండ్..

20 ఏళ్లుగా ఆటోస్టాండ్ ఏర్పాటుపై ఎంతోమంది అధికారులు, పాలకులు కృషి చేస్తామని చెప్పినా అదీ మాత్రం కార్యరూపం దాల్చకపోవడంతో ఆటోలను రోడ్డుపైనే నిలుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ప్రజలను వేధిస్తోంది. పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్లలో ట్రాఫిక్ సమస్య మరీ తీవ్రంగా కనిపిస్తోంది. అసలే చిన్న సందులు, అందులోనూ ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లాల్సి వస్తుండడంతో నిత్యం ప్రజలు ఈ ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు. ఇక ఇవి చాలవు అన్నట్లుగా ట్రాన్స్‌పోర్ట్ లారీలను పట్టణంలోని ప్రధాన రహదారిపైనే నిలిపి దుకాణాలకు సరుకు దింపుతుండడంతో చాలా ఇబ్బందికరంగా మారుతోంది. మణుగూరు ప్రాంతం సింగరేణి, బీటీపీఎస్ వంటి పరిశ్రమలతో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో బీటీపీఎస్, సింగరేణికి సంబంధించిన లారీలు, భారీ లోడ్ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ లారీలు పట్టణ ప్రధాన రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది.

కనబడని ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫిక్ పోలీస్ నియమిస్తామని గతంలో పోలీస్ ఉన్నతాధికారులు అనేక సందర్భాల్లో చెప్పినప్పటికీ నేటికి కార్యరూపం దాల్చలేదు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రించే నాథుడే కరువయ్యారు. బ్లూ కోల్ట్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది చేపడుతున్న నియంత్రణ చర్యలు పూర్తి స్థాయిలో ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయి. ఇటు సింగరేణి, అటు బీటీపీఎస్‌లతో పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తుండగా ప్రధాన రహదారిని కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని మరికొందరు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ మేరకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మెరుగైన వైద్యసేవలు అందించాలి



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న సీఎంఓ, అధికారులు

మణుగూరుటౌన్/మణుగూరురూరల్: ఆస్పత్రులకు వచ్చే సింగరేణి కార్మికులు, వారి కుటుంబీకులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సింగరేణి సీఎంఓ ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్ సూచించారు. మణుగూరు ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఆయన ఏరియా జీఎం దుర్గం రాంచందర్, డీవైసీఎంఓ మేరీకుమారితో కలిసి రూ.16.75 లక్షలతో నిర్మించిన డీవైసీఎంఓ, డ్యూటీ డాక్టర్, ఆఫీస్ గదులను ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో విభాగాలను పరిశీలించాక వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. వివిధ విభాగాల అధికారులు, వైద్యులు, సంఘాల నాయకులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రమేశ్, జ్యోతిర్మయి, పి.శేషగిరిరావు, తాళ్లూరి సురేష్, ఇన్నయ్య, రమణయ్య, మణి, సులోచన, సౌజన్య, రామనర్సయ్య, మేకల ఈశ్వర్, కృష్ణంరాజు, శ్రీనివాస్, మధుసూదన్‌రావు, విజయ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, గైనకాలజిస్ట్, పీడియాట్రీషియన్‌ను నియమించి ఫిజియోథెరపీ పరికరాలు సమకూర్చాలని ఏఐటీయూసీ నాయకుడు రాంనర్సయ్య ఆధ్వర్యాన సీఎంఓకు వినతిపత్రం అందజేశారు. అలాగే, సీఎంను ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు సన్మానించారు. సిబ్బంది సారా, ఉషారాణి, రూప, నాగమణి, విద్య, సుభద్ర, రామారావు, రామారావు, బొర్రయ్య, ల్యాబ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులనే వాడాలి



మాట్లాడుతున్న కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్

అశ్వారావుపేటరూరల్: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతోపాటు, ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయవచ్చని అన్నారు. ప్రతి రైతు పంట మార్పిడి పద్ధతులను పాటించాలని కళాశాల శాస్త్రవేత్త మధుసూధన్‌రెడ్డి అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీఏ రవికుమార్ మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన షాపుల్లో మాత్రమే కొనుగోలు చేసి, వాటి రసీదులను రైతు జాగ్రత్తగా పెట్టుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏఓ పి.శివరాం ప్రసాద్, ఉద్యాన అధికారి వేణుమాధవన్, ఏఈఓలు సతీష్, సూరిబాబు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

చంద్రుగొండ: ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దశలవారీగా అందరికీ న్యాయం జరుగుతుందని, కొంతమంది కావాలనే దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. పేదలకు అవాసం కల్పించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, హౌజింగ్ ఏఈ రాము, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, కిరణ్‌రెడ్డి, ఫజల్‌బక్ష్, మనోహర్, కె.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

దుమ్ముగూడెం: మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఈ నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అంతరాయం ఏర్పడుతుందని మిషన్ భగీరథ ఏఈ ఉపేంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా దుమ్ముగూడెం మండలానికి తాగునీరు సరఫరా చేసే పర్ణశాల ఇంటేక్ వెల్ పూడికతీత పనులు ప్రారంభించినట్లు, దీనివల్ల మండలంలో రోజు విడిచి రోజు రాత్రి పూట నీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు తగు విధంగా తాగునీటి నిల్వలు ఏర్పాటు చేసుకోవలసిందిగా కోరారు.

వారపు సంత వేలం ఖరారు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం స్థానిక వారపు సంత వేలం పాటను నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ సుజాత పర్యవేక్షణలో 2025–26 సంవత్సరానికి బహిరంగ వేలం పాటను నిర్వహించగా, స్థానిక మాజీ వార్డు సభ్యులు కాండ్రకోట ఉదయ్‌కుమార్ అత్యధికంగా రూ.1.56లక్షలకు దక్కించుకున్నారు. అలాగే సంత ఆవరణలో ఉన్న రెండు షాపులను కట్టా రాంబాబు అనే యువకుడు రూ.45,100 రూపాయలకు, కొబ్బరి తోటను రూ.73వేల రూపాయాలకు దామెర శెట్టి ఫణి దక్కించుకున్నారు. ఈ వేలం పాటల ద్వారా మున్సిపాలిటీకి మొత్తం రూ.2లక్షల 74వేల100 ఆదాయం చేకూరినట్లు కమిషనర్ తెలిపారు.

కాగా, మున్సిపాలిటీ నిర్ణయించిన వేలం పాట ధరలను కొంతమంది వ్యక్తులు తమకు అనుకులాంగా మార్పులు చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మున్సిపాలటీకి రావాల్సిన ఆదాయం భారీగా తగ్గినట్లు ప్రచారం జరుగుతోంది.

శివాలయం చైర్మన్‌గా నర్సింహారావు



ప్రమాణం చేస్తున్న శివాలయం చైర్మన్ నర్సింహారావు, సభ్యులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం చైర్మన్‌గా ఎర్రగుంటకు చెందిన మల్లెల నర్సింహారావు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమక్షంలో వేదపండితులు ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. పాలకమండలి సభ్యులుగా గజ్జ పూర్ణచందర్‌రావు, రుంజా బుచ్చమ్మ, మాయర కృష్ణయ్య, నల్లబెల్లి వెంకటేశ్వర్లు, కేసర కృష్ణ, బోయినపల్లి వెంకటేశ్వర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో నాయకులు పర్సా వెంకటేశ్వర్లు, వనమా గాంధీ, బాణావత్ భీముడు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

భద్రాచలంటౌన్: భద్రాద్రి హరిహర క్షేత్రంలో శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయ నంబూద్రి అరుణ రామచంద్రన్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, విఘ్నేశ్వరుడికి, నాగరాజు స్వామి, కుమారస్వామి వారికి ఉపాలయాలలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీఅయ్యన్ అయ్యప్ప స్వామి వారి తీర్థ, ప్రసాదాలు భక్తులకు అందజేశారు. సిదాంతపు నాగరాజు–సాయి వందన దంపతులు వారి కుమారులు గురు విద్వాన్, హ్రీషికేష్ ప్రధాన్ సహకారంతో 200 మందికి అన్న ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి నివాళి



భద్రాచలంటౌన్: అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం నివాళులర్పించారు. అంబేడ్కర్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మా మాట్లాడుతూ.. అల్లూరి త్యాగం మనందరికీ మార్గదర్శకమని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, నిడదవోలు నాగబాబు, ములిశెట్ట రాంమోహన్ రావు, చెల్లిబోయిన వెంకన్న, ముత్యాల చంద్రశేఖర్, చక్రవర్తి, అల్లాడి సుబ్బారావు, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణపేట గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. డివిజన్ నాయకులు దాసరి సాయన్న మాట్లాడుతూ... మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమిద్దామన్నారు. కార్యక్రమంలో వీరాజు, కొమరం బాబు, లక్ష్మి, శ్యామల, సీత పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో తనిఖీ



దమ్మపేట మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖర రెడ్డి

దమ్మపేట: దమ్మపేట వ్యవసాయ మార్కెట్ యార్డులోని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

బుధవారం మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన ఏఓ.. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దళారి వ్యవస్థ గురించి ఆరా తీశారు. ధాన్యపు రాశులను పరిశీలించి, రైతులు వివరాలు తెలుసుకున్నారు. దళారులు ప్రవేశించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ



ఇంకుడుగుంత తవ్వుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

మణుగూరురూరల్: వర్షపు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం ఇంకుడు గుంతలతోనే సాధ్యమవుతుందని మణుగూరు ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఆయన గడ్డపార చేతబట్టి తన సిబ్బందితో కలిసి ఇంకుడు గుంతను తవ్వారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంకల్పం ప్రకారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత లేకుండా ఉంటుందని తెలిపారు.

మంత్రి పొంగులేటికి వినతి

మణుగూరుటౌన్: సింగరేణి వల్ల ప్రభావితమవుతున్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపాలిటీలోని విఠల్‌రావు నగర్, రాజుపేట గ్రామస్తులు బుధవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులు ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో మంత్రిని కలిశారు. ఏరియాలో మణుగూరు ఓసీ ప్రభావంతో పీకే–1, రాజుపేట, బాపనకుంట, విఠల్‌రావునగర్‌లలో తమ నివాసాలు బీటలు వారి పగుళ్లు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లపై దుమ్మూధూళి పడటం వల్ల తాగునీరు సైతం కాలుష్యానికి గురవుతున్నాయన్నారు.తమకు పరిహారం అందించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సరెడ్డి పుల్లారెడ్డి, దుర్గ్యాల సుధాకర్, ఏడారి రమేష్, రాజుపేట, విఠల్ రావునగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వాసవీమాత జయంతి వేడుకలు

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆలయాల్లో పూజలు జరిగాయి. వాసవీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు చాలీసా పారాయణం చేసి ప్రత్యేక భజనలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయాల్లో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వాసవీక్లబ్, వనితా, ఆర్యవైశ్యులు కార్యక్రమాల్లో ముఖ్య భూమిక పోషించారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరుటౌన్: సామూహిక కుంకుమార్చన పూజలో పాల్గొన్న మహిళలు



అశ్వారావుపేటరూరల్: శివలింగాకారంలో అమర్చిన కలశాలు

వికృత రూపంలో వనం

- విరిగిపడిన వృక్షాల కొమ్మలు, మొక్కలు
- పిచ్చి మొక్కలతో నిండిన అంతర్గత దారులు
- నిర్వహణ లేక అధ్వానంగా దర్శనం

గత ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయాల వ్యయంతో ఆహ్లాదం కోసం ప్రతీ పంచాయతీకి ఓ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రజానికానికి ఆహ్లాద భరితమైన వాతావరణాన్ని అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ పల్లె ప్రకృతి వనాలు కనీస నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. దీనికి అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఓ పల్లె ప్రకృతి వనమే నిదర్శనం.



వనంలోకి వెళ్లే ప్రధాన రోడ్డుపై విరిగిపడి అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు



పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న అంతర్గత రోడ్డు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కనే గత ప్రభుత్వ హాయంలో మేజర్ గ్రామ పంచాయతీ హోదా సమయంలో సుమారు ఒక ఎకరం స్థలంలో జాతీయ ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులతో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. ఇందులో చుట్టు వాకింగ్ ట్రాక్‌ల కోసం అంతర్గత రోడ్లతోపాటు, వందలాధి మొక్కలను నాటారు. ఈ మొక్కలు పెద్ద పెద్ద వృక్షాలుగా మారడంతో ఇటీవలె వచ్చిన గాలి దుమారాలతో పార్కులోకి ప్రవేశించే ప్రధాన మార్గంలో పనస చెట్టు భారీ కొమ్మలు, అంతర్గత దారుల్లో ఉన్న చిన్న, చిన్న మొక్కలు సైతం విరిగిపడ్డాయి. దారులకు అడ్డంగా పడి ఉన్న చెట్ల కొమ్మలను నెలలు గడుస్తున్న కనీసం వాటిని తొలగించలేదు. దీంతో ప్రకృతి వనంలోకి వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది.

అడవిని తలపిస్తున్న వనం

ఈ పల్లె ప్రకృతి వనంలోకి వెళ్లితే అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పార్కు లోపల ఉన్న అంతర్గత దారుల్లో సైతం గడ్డితోపాటు పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, దారులు కమ్మేశాయి. కాలినడకన వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా తయారైంది. ఈ వనంలోకి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళలో 50 నుంచి 60 మంది వృద్ధులు, యువతీ, యువకులు, మహిళలు వాకింగ్ చేసేందుకు, సేద తీరేందుకు, అలాగే ఆటలు ఆడేందుకు చిన్నారులు వస్తుంటారు. ఈ వనంలో నెలకొని ఉన్న పరిస్థితులతో వారంతా పడే ఇక్కట్లు వర్ణాతీతంగా ఉన్నాయి. ఈ పల్లె ప్రకృతి వనాన్ని మేజర్ గ్రామ పంచాయతీ సమయంలో సిబ్బంది నిత్యం శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించే వారు. కాగా, కొద్ది నెలల క్రితమే మేజర్ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయగా, ఆ నాటి నుంచి ఈ పల్లె ప్రకృతి వనాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీస నిర్వహణ లేకపోవడంతో పల్లె ప్రకృతి వనం అధ్వాన్నంగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఇంకా పంచాయతీ బోర్డే..

అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ పల్లె ప్రకృతి వనం బోర్డుపై మాత్రం ఇంకా గ్రామ పంచాయతీగానే ఉండటం గమనార్హం. కనీసం బోర్డుపై మున్సిపాలిటీ పేరు కూడా లేదు అంటే.. ఈ పల్లె ప్రకృతి వనం ఉన్నట్లు మున్సిపాలిటీ అధికారులకు తెలుసా?.. లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రకృతి వనాన్ని పట్టించుకోని, ఆహ్లాదకరంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.